సాక్షి
వికారాబాద్
బుధవారం ¦ 5 ¦ జూలై ¦ 2023



ఎన్నాళ్లీ ఆకలి చదువులు!

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం హామీ నేటికీ నీటి మూటగానే మిగిలిపోయింది. 8లో▸



ఈ వార్డెన్ మాకొద్దు

ఇబ్బందులు సృష్టిస్తున్న వార్డెన్ తమకొద్దని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వేడుకున్నారు. 8లో▸



ఎక్కడి చెత్త అక్కడే!

తాండూరు మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ, తరలింపు పనులు పూర్తి అధ్వానంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

అడిషనల్ కలెక్టర్‌ను కలిసిన ట్రెసా జిల్లా ప్రతినిధులు



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు బొకే అందజేస్తున్న ట్రెసా జిల్లా నాయకులు

అనంతగిరి: జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు చేపట్టిన లింగ్యానాయక్‌ను మంగళవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి విజయేందర్, నాయకులు అప్పలనాయుడు, దీపక్, రమేష్‌కుమార్, రవీందర్, అమరేంద్ర కృష్ణ, మహేష్‌గౌడ్, విద్యాసాగర్ రెడ్డి, నరేందర్, బాలు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాలలో మూడు ఖాళీ సీట్లు

తాండూరు టౌన్: తాండూరు రాష్ట్ర మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో మూడు ఎస్టీ రిజర్వేషన్ కింద సీట్లు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఫాతిమా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతిలో ఒకటి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన ఎస్టీ విద్యార్థినులు ఈనెల 7వ తేదీలోపు నేరుగా స్కూల్‌కు వచ్చి అడ్మిషన్ పొందాలని సూచించారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: తెలంగాణ వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధుల కోసం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాల, కళాశాలలో 2023–24 సంవత్సరానికి అర్హులైన అంధ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. 1నుంచి 10వ తరగతిలో చేరే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్: 9618243794లో సంప్రదించాలని సూచించారు.

10 నుంచి మాక్ పోలింగ్

వికారాబాద్ అర్బన్: ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి జిల్లాలో మాక్ పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎన్నికల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తేదీ నుండి అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంల ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ పాల్గొన్నారు.

నయా బాస్.. రోనాల్డ్ రాస్

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియామకం
- నేడు బాధ్యతల స్వీకరణ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ నూతన కమిషనర్‌గా డి.రోనాల్డ్‌రాస్ నియమితులయ్యారు. రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న డీఎస్ లోకేశ్‌కుమార్‌ను గతవారమే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అడిషనల్ సీఈఓగా నియమించగా, అందుకనుగుణంగా రాష్ట్రప్రభుత్వం తాజాగా ఉత్వర్వులు జారీ చేసింది. రోనాల్డ్ రాస్ గతంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (టౌన్‌ప్లానింగ్)గా, సెంట్రల్ జోన్ (ఖైరతాబాద్)కమిషనర్‌గా పని చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో, కూల్చివేయడంలో చురుగ్గా వ్యవహరించారు. రోనాల్డ్‌రాస్ 2006 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఉమ్మడి రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో శిక్షణ తీసుకున్న ఆయన నర్సాపూర్ సబ్‌కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, డ్వాక్రా డైరెక్టర్‌గా, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టు అడిషనల్ సీఈఓగా పనిచేశారు. నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆర్థికశాఖతో పాటు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా, గనులు, భూగర్భశాఖ కార్యదర్శిగా కూడా ఉన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం జరుగుతున్న బదిలీల్లో భాగంగానే ఈ బదిలీలు చోటు చేసుకున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులైన రోనాల్డ్‌రాస్ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు.

ఆగని తవ్వకాలు!



కరన్‌కోట్ ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న నాపరాతి తవ్వకాలు

తాండూరులో యథేచ్ఛగా నాపరాతి అక్రమ మైనింగ్

- ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు
- సర్కారు ఆదాయానికి గండి
- అచేతన స్థితిలో సంబంధిత శాఖలు

తాండూరు రూరల్: తాండూరు మండలంలో నాపరాతి అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో మండలంలో పరిస్థితి తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అనే చందంగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా యథేచ్ఛగా మైనింగ్ సాగుతోంది. కొందరు రాజకీయ బలంతో.. మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాలు, వందలాది మంది కూలీలతో నిబంధనలేవీ పాటించకుండా సర్కారు సంపదను కొల్లగొడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కరన్‌కోట్ ప్రభుత్వ భూమిలో..

కరన్‌కోట్ గ్రామంలోని సర్వే నంబర్–2, 18 (బీ)లో ప్రభుత్వ భూమి ఉంది.ఈ భూములను ప్రభుత్వం గతంలో పేదలకు ఇచ్చింది. ప్రస్తు తం ఇందులో బడా నాయకులు పాగా వేశారు. ఇష్టారాజ్యంగా మైనింగ్ చేపడుతూ రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపడుతూ సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. సర్వేనంబర్ 18(బీ)లో ఓ దళిత యువకుడికి కేటాయించిన భూమిలో ఓ స్థానిక నేత దర్జాగా నాపరాతి మైనింగ్ చేపడుతున్నాడు. ఈ విషయంపై పరస్పరం ఫిర్యాదులు వెళ్లినా పోలీసులు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు.

కన్నెత్తిచూడని మైనింగ్ శాఖ

కరన్‌కోట్ శివారులో అక్రమ మైనింగ్ ముమ్మరంగా సాగుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు ఇచ్చే డబ్బులకు ఆశపడుతున్న కొంతమంది అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా మైనింగ్ కోసం విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నా.. సంబంధిత శాఖ అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రెవెన్యూలో సిబ్బంది కొరత

ప్రభుత్వ భూములు, సహజ సంపదను పరిరక్షించాల్సిన రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత నెలకొంది. గతంలో ఊరికో వీఆర్‌ఓ ఉండటంతో ప్రభుత్వ భూములు, అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉండేది. ప్రస్తుతం వీఆర్‌ఓ వ్యవస్థ రద్దు కావడంతో పరిస్థితి మారిపోయింది. స్థానికంగా జరుగుతున్న అక్రమాలపై మండల, జిల్లా స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చే వారు లేకుండా పోయారు. ఎవరైనా స్థానికులు ఫోన్ చేసి సమాచారం ఇస్తే.. వివరాలు కనుక్కుని మరీ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో తమకెందుకులే అని ఎవరూ ముందుకు రావడం లేదు.

రాజకీయ ఒత్తిళ్లు

నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపేందుకు మైనింగ్, పోలీసు, రెవెన్యూ శాఖలు పలుమార్లు ప్రయత్నించాయి. క్షేత్రస్థాయిలో వెళ్లి అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న యంత్రాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. కానీ ఆ వెంటనే వీరికి రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

దాడులు నిర్వహిస్తాం



కరన్‌కోట్ శివారులోని ప్రభుత్వ భూమిలో నాపరాతి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో కలిసి వెంటనే గనులకు వెళ్లి దాడులు నిర్వహిస్తాం. గతంలో కరెంట్ కట్ చేయాలని విద్యుత్ శాఖకు కూడా లెటర్‌రాశాం. రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా పట్టించుకోకుండా ప్రభుత్వ భూమిని కాపాడుతాం. ఇందులో ఎలాంటి చర్యలకైె నా వెనకాడే ప్రసక్తి లేదు.

– చిన్నప్పలనాయుడు, తహసీల్దార్, తాండూరు



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న బ్రాహ్మణ, అర్చక, పురోహితులు

భక్తిశ్రద్ధలతో యాగం

తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నిర్వహిస్తున్న రాజశ్యామల, శతచండీ, సౌరలక్ష్మి, సుదర్శన సహిత అతిరుద్ర మహాయాగాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం బషీరాబాద్, యాలాల, పెద్దేముల్ మండలాల నుంచి 700 మంది దంపతులు యాగంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు నియోజకవర్గంలోని బ్రాహ్మణ, అర్చక, పురోహితులకు నూతన వస్త్రాలు, సుదక్షిణ, తాంబూలాదులు అందజేసి, ఆశీర్వచనాలు పొందారు.

– తాండూరు టౌన్



ఎమ్మెల్యేతో పాటు కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న గజరాజు

రేపటి నుంచి సమ్మె



బషీరాబాద్‌లో సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నేత శ్రీనివాస్, కార్మికులు

- నోటీసు అందజేసిన పంచాయతీ కార్మికులు
- జీఓ 51ని రద్దు చేయాలని డిమాండ్
- అందరినీ పర్మినెంట్ చేయాలని అభ్యర్థన

బషీరాబాద్: పంచాయతీ కార్మికులు గురువారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీరాబాద్‌లో కార్మికులతో కలిసి అధికారులకు నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 51ను రద్దుచేసి, పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం నెలనెలా వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతిఒక్కరికీ రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వసతులు కల్పించాలని కోరారు. ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లిచడంతో పాటు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఏకతాటిపై నిలబడి సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు శ్యామప్ప, ఉపాధ్యక్షులు లక్ష్మి, లక్ష్మణ్, శ్యామప్ప, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, కోశాధికారి ఉషనప్ప, సభ్యులు నర్సింలు, ఎల్లప్ప బసమ్మ, దేవమ్మ, పార్వతమ్మ, రాములు, చిన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

- మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి

వికారాబాద్ అర్బన్: మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కెతావత్ లలిత కుమారి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక సిద్దార్థ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌తో కలిగే దుష్పరిణామాలను అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. సోషల్ మీ డియా వినియోగంపై కూడా యువత, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వికారాబాద్ జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ నవీన్ చంద్ర మాట్లాడుతూ..సమాజాన్ని పట్టి పీడిస్తున్న భూతం మాదక ద్రవ్యమన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పోరాట యోధుడికి ఘన నివాళి

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్, బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్, అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ సహాయ అధికారి భీమరాజు, బీసీ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– అనంతగిరి



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

దేశం చూపు తెలంగాణ వైపు

- అన్ని రంగాల్లో మనమే నంబర్ వన్
- సీఎం కేసీఆర్ కృషితోనే ఇది సాధ్యమైంది
- ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి

పరిగి: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారని ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కాళ్లాపూర్ నుంచి లొంకహనుమాన్ ఆలయం వరకు రూ.76 లక్షల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డు, లొంక క్షేత్రంలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. తెలంగాణ రాక ముందు, వచ్చిన తర్వాత ప్రభుత్వం అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మిస్తోందని తెలిపారు. మండలం నుంచి ప్రతీ జీపీకి బీటీ రోడ్డు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు త్వరలోనే బీటీ రోడ్లు వేయిస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని వివరించారు. ప్రస్తుతం అనేక గ్రామాల్లో పట్టణాలకు దీటుగా వసతులు సమకూరాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ప్రస్తుతం దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని, అన్ని రాష్ట్రాలకు మనం దిక్సూచిగా నిలిచామని స్పష్టంచేశారు. ఇక్కడ అమలవుతున్న పథకాలను తమ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ప్రజల నుంచి దేశ వ్యాప్తంగా డిమాండ్లు వినిపిస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

నకిలీలకు కళ్లెం పడేనా?

- ఎరువుల బస్తాలకు దేశమంతా ఒకటే రంగు
- కంపెనీలు వేరైనా కలర్ ఒకటే
- ఈ సీజన్ నుంచే అమల్లోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు
- బస్తాపై ధర, సబ్సిడీ ముద్రణ

కొడంగల్: దేశ వ్యాప్తంగా ఎరువుల బస్తాలు ఒకే రంగులో వస్తున్నాయి. కంపెనీలు వేరైనా కలర్ మాత్రం ఒక్కటే. నకిలీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. దీంతో రైతులను మోసం చేసే దళారులకు కళ్లెం వేసినట్లయింది. ప్రధాన మంత్రి భారతీయ జన ఉర్వారక్ పరియోజన పథకంలో భాగంగా భారత్ డీఏపీ, భారత్ యూరియా, భారత్ కాంప్లెక్స్ ఎరువులను ఎంపిక చేసిన రంగు బస్తాల్లోనే విక్రయిస్తున్నారు. యూరియా బస్తాలన్నీ ఒక రంగులో, డీఏపీ బస్తాలన్నీ ఒక రంగులో, కాంప్లెక్స్ ఎరువులు మరో రంగులో వస్తున్నాయి. ఏకంపెనీకి చెందిన ఎరువైనా బస్తా రంగు ఒకేలా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంది. ఇకపై ఎరువులను విక్రయించే కంపెనీలు ప్రభుత్వం సూచించిన రంగు బస్తాలనే వినియోగించాల్సి ఉంటుంది. ఒక రకం ఎరువు ఒకే రంగు బస్తా ఉండేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది వానాకాలం సీజన్ నుంచే దీన్ని అమలు చేయాలని సూచించింది. భారత్ డీఏపీ భారత్ యూరియా భారత్ కాంప్లెక్స్ ఎరువులను ఎంపిక చేసిన రంగు బస్తాల్లోనే విక్రయిస్తున్నారు.



పసుపు రంగులో యూరియా బస్తాలు



డీఏపీ బస్తాపై వివరాల ముద్రణ

కొరత లేకుండా చర్యలు

గతంలో ఎరువుల కంపెనీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నాయని.. డిమాండ్ ఉన్న ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయిస్తున్నారని కేంద్రం గుర్తించింది. దీని వల్ల రైతులకు నష్టం జరుగుతుందని అధికారులు భావించారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఇచ్చే రాయితీ రైతులకు తెలియడానికి వీలుగా బస్తాపై పూర్తి వివరాలను ముద్రించేలా ఆదేశాలు ఇచ్చారు.

పైభాగంలో ధర సబ్సిడీ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానంలో కంపెనీతో సంబంధం లేకుండా అన్ని కంపెనీలు ఒక రకమైన ఎరువును ఒకే రకమైన నాణ్యతతో ఒకే రంగు బస్తాలో సరఫరా చేయాల్సి ఉంది. బస్తా పైభాగంలోనే కంపెనీ ధర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలు పెద్ద అక్షరాలతో ముద్రిస్తున్నారు. కంపెనీల పేర్లు గుర్తులను చిన్న అక్షరాలతో బస్తా కింది భాగంలో ముద్రిస్తున్నారు. బస్తా మధ్యలో ప్రధాన మంత్రి భారతీయ జన ఉర్వారక్ పరియోజన అని రాసి ఉంటుంది. ఇప్పటికే మార్కెట్‌లోకి సరఫరా చేసిన ఎరువుల బస్తాలకు ఈ వివరాలు ఉన్నాయి. యూరియా బస్తాలన్నీ ఒక రంగులో.. డీఏపీ బస్తాలన్నీ ఒక రంగులో.. కాంప్లెక్స్ ఎరువులన్నీ ఒక రంగులో వస్తున్నాయి. ఇప్పటికైనా ఎరువుల విక్రయంలో పారదర్శకత వస్తుందా..? లేదా..? అనేది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

వాముకు రికార్డు ధర
క్వింటాలుకు రూ.20,100



మర్పల్లి మార్కెట్‌లో వాముకు బీట్లు నిర్వహిస్తున్న కమీషన్ ఏజెంట్లు

మర్పల్లి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వాముకు రికార్డు ధర పలికింది. ఏకంగా రూ.20,100 ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రెండు వారాల కిత్రం క్వింటాలు వాము ధర రూ.15 వేలు, గతవారం రూ.17వేలు పలికింది. మంగళవారం ఒక్కసారిగా కనీవిని ఎరుగని విధంగా క్వింటాలు ధర రూ.20,100 పలికింది. గత సంవత్సరం అధిక వర్షాలు కురవడంతో వామ పంట దిగుబడులు అంతంత మాత్రమే రావడంతో డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా వామును సుగంధ ద్రవ్యాలకు చెందినది కావడంతో డిమాండ్ పెరుగుతోందన్నారు. వాము ధర పెరగడంతో రైతులు కొంత మేరకు లాభాలు గడించవచ్చని వ్యాపారులు పేర్కొన్నారు. క్వింటాలు పసుపు కాడి రూ. 7వేలు పలకగా గుండ్రని పసుపు రూ.7,050 పలికింది. గతంలో ఏనాడూ వాముకు ఇంత ధర పలకలేదని మర్పల్లి కమీషన్ ఏజెంట్లు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

యాలాల: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బెన్నూరు నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నారు. వాహనాలను పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

దోమ : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విశ్వజన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మోత్కూర్ అనుబంధ గ్రామమైన చెంచుకాలనీకి చెందిన చుక్కప్ప (40) అనే వ్యక్తి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. సోమవారం ఐనాపూర్ సమీపంలో ఉన్న చెరువుకు చేపల వేటకు వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోడడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. మంగళవారం ఉదయం వెళ్లి గాలించగా వల చుట్టుకుని శవమై కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విశ్వజన్ తెలిపారు.

ఇద్దరు రౌడీషీటర్ల బైండోవర్



రౌడీషీటర్లతో ఎస్‌ఐ

యాలాల: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లను తహసీల్దార్ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని జక్కేపల్లికి చెందిన వడ్డే శ్రీనివాస్, ఇందిరమ్మ కాలనీకి చెందిన అబ్దుల్ ఆరీఫ్‌లు రౌడీషీటర్లు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇద్దరిని తహసీల్దార్ గోవిందమ్మ ఎదుట బైండోవర్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దోమ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మండల పరిధిలోని బొంపల్లికి చెందిన యాదయ్య గత నెల 25న జరిగిన తమ్ముడి దశదిన కర్మలో పాల్గొని ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా అతివేగంగా బైక్ వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యాదయ్యను కుటుంబసభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముళ్లు పక్షం రోజుల్లోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ఎన్నాళ్లీ ఆకలి చదువులు!



దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని కలిసి తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం కలేనా?
- ఏళ్లు గడుస్తున్నా నెరవేరని హామీ
- దూర ప్రాంత విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఆకలితో చదువులపై తగ్గుతున్న శ్రద్ధ

వికారాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం హామీ నేటికీ నీటి మూటగానే మిగిలిపోయింది. ఉమ్మడి రాష్ట్రంనుంచే ఈ ప్రతిపాదనలు ఉన్నా ఈనాటికీ కార్యరూపం దాల్చడంలేదు. ప్రత్యేక రాష్ట్రంలో మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకోసం ప్రవేశపెడతామని సర్కార్ ఇచ్చిన హామీకి అతీగతీ లేకుండాపోయింది. దీంతో నిత్యం ఉదయాన్నే ఇంటినుంచి బయలుదేరుతున్న విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలనుంచి మండల కేంద్రాలలో ఉన్న జూనియర్ కళాశాలలకు సమయానికి రావాలంటే ఉదయం 7నుంచి 8 గంటల మధ్యలో బయలుదేరాల్సి ఉంటుంది. ఆ సమయంలో వంట సిద్ధం కాకపోవడం, గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంపై ఆధారపడిన వారు, కూలీపనులు చేసుకునేవారు అధికంగా ఉండడంతో విద్యార్థులు టిఫిన్ బాక్సు తెచ్చుకునే పరిస్థితి తక్కువగా ఉంటుంది. దీంతో ప్రభుత్వమే జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటుచేస్తామని ఐదేళ్లుగా ఊరిస్తూ వస్తున్నది. అయినప్పటికీ ఈ విద్యాసంవత్సరం కూడా అమలుకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో సాయంత్రం ఇంటికి వెళ్లేదాకా విద్యార్థులు ఆకలితో అల్లాడుతున్నారు.

9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

జిల్లాలో మొత్తం 66 జూనియర్ కళాశాలలు ఉండగా, వీటిలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ప్రైవేటు కళాశాలలు 30 ఉండగా, 27 కళాశాలలు సోషల్‌వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొత్తం విద్యార్థులు 3,300 మంది ఉన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 800 ఉండగా ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నాయి. ద్వితీయ సంవత్సరంలో 2,500 మంది విద్యార్థులున్నట్లు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఏయేటికాఏటా వాయిదా వేస్తూ వస్తున్నది. దీంతో మధ్యాహ్నం భోజనం లేక అధికశాతం మంది విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. ఉన్నతవిద్యను ప్రోత్సహించేందుకు, ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి గాను మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించేందుకు ప్రభుత్వం ఐదేళ్ల నుంచి హామీ ఇస్తున్నా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు.

ఈసారైనా అమలు చేస్తారా?

ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నది. ఈసారైనా మధ్యాహ్న భోజనం అమలుచేస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నా అమలుకు ప్రభుత్వ ఎటువంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. జిల్లా లో గ్రామీణ నేపథ్యం ఉన్న మధ్యతరగతి, పేద విద్యార్థులే అధికంగా ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశా లు పొందుతున్నారు. వీరంతా బస్సుల్లో, ఆటోల్లో ఉదయాన్నే బయలుదేరితే గాని సమయానికి గ్రా మాలనుంచి కళాశాలలకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఉదయాన్నే భోజనం సిద్ధం కాకపోవడంతో కొన్నిసార్లు ఖాళీ కడుపుతోనే వస్తున్న విద్యార్థులు.. మధ్యాహ్నం ఆకలిని భరించలేక ఇబ్బందులు పడు తున్నారు. కొంతమంది తెచ్చుకున్న భోజనాన్ని మరికొందరు విద్యార్థులతో షేర్ చేసుకుంటున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా ఎదిగే వయసులో పస్తులు ఉండాల్సి రావడంతో విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భోజన సదుపాయాన్ని కల్పించాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
ఎస్పీ కోటిరెడ్డి

మోమిన్‌పేట: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ కోటిరెడ్డి భరోసానిచ్చారు. మండల పరిధిలోని లచ్చానాయక్‌తండాలో ఇటీవల విఠల్ హత్యకు గురైన విషయం విదితమే. మంగళవారం ఎస్పీ తండాన్ని సందర్శించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులందరినీ అదుపులోకి తీసుకొన్నామని త్వరలో రిమాండుకు తరలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. బాధితులకు పోలీస్ అండగా ఉండి రక్షణ కల్పిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ సత్యనారాయణ, సీఐ వెంకటేశం, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, సర్పంచు లలిత ఉన్నారు.



మృతుడి భార్యతో మాట్లాడుతున్న ఎస్పీ

ఈ వార్డెన్ మాకొద్దు

గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎదుట విద్యార్థుల వేడుకోలు



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి కోటాజీ

కుల్కచర్ల: ఇబ్బందులు సృష్టిస్తున్న వార్డెన్ మాకు వద్దని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ ఎదుట వేడుకున్నారు. తమకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంలేదని, పాఠశాల ప్రాంగణంలోనే మద్యం సేవిస్తుండటంతో సోమవారం విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలోనే మద్యం సేవించడం ఎంతవరకు సమంజసమన్నారు. భోజనం నాణ్యతగా లేదని ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు కొనసాగుతున్నాయని, నిర్వాహకులు విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేయకుండా బాధ్యతను నిర్వహించాలన్నారు.

వార్డెన్‌పై బదిలీ వేటు ?

విచారణ చేపట్టిన సంక్షేమశాఖ అధికారి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో విడివిడిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వార్డెన్‌ను బదిలీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేయడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని అధికారి తెలిపారు. ఈ క్రమంలో వార్డెన్‌పై బదిలీ వేటు పడనున్నట్లు తెలుస్తోంది.

ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి, దౌల్తా బాద్ గ్రామాల్లో మంగళవారం ఘనంగా పోచమ్మతల్లి బోనాల పండుగ నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలతో తరలివచ్చి అమ్మవారి ఆల యం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పి ంచారు. అలాగే వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.



అమ్మవారి ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



తాండూరు టౌన్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న కురుమ కులస్తులు

తాండూరు టౌన్: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ అన్నారు. నెహ్రూగంజ్‌లోని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ఆయనకు తగిన గుర్తింపు దక్కిందన్నారు. ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో మాట్లాడి తాండూరులో కురుమ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గౌడి మంజుల మాట్లాడుతూ.. కొమురయ్య చూపిన తెగింపు, త్యాగం, పోరాట మార్గంలో కులబాంధవులు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎంపీపీ రమేశ్, కురుమ సంఘం డివిజన్ అధ్యక్షులు నాగారం జగదీశ్, ఉపాధ్యక్షుడు పూజారి పాండు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నర్సింహులు, బాలు, శ్రీశైలం, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

తాండూరు ఆర్టీసీ సిబ్బందికి అవార్డులు



తాండూరు టౌన్: అవార్డులు అందుకున్న తాండూరు డీఎం, డ్రైవర్లు, కండక్టర్లు



పరిగి: అవార్డులు అందుకున్న డీఎం, సిబ్బంది

తాండూరు టౌన్ : దసరా, సంక్రాంతి స్పెషల్ చాలెంజ్ అవార్డులను తాండూరు ఆర్టీసీ డిపోకు చెందిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తాండూరు డిపోకు చెందిన డ్రైవర్ ఎండి హసన్, అంజిలప్ప, కండక్టర్లు వెంకటయ్య, ఎండి గులాం మహ్మద్‌కు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండి సజ్జనార్‌లు అందజేశారు. అవార్డుల రేసులో రాష్ట్రంలోనే రంగారెడ్డి రీజియన్ ద్వితీయ స్థానం దక్కించుకున్నది. ఈసందర్భంగా తాండూరు డిపో మేనేజర్ సమతకు సంస్థ ఎండి సజ్జనార్ అవార్డు ప్రదానం చేశారు.

పరిగి డిపోలో..

పరిగి: ఆర్టీసీ డిపో డ్రైవర్లు రహీంఖాన్, హనుమంతు, కండక్టర్లు ఆంజనేయులు, శ్రీశైలం దసరా, సంక్రాంతి స్పెషల్ అవార్డులు అందుకున్నట్లు డీఎం పవిత్రి తెలిపారు. పరిగికి ఉత్తం ప్రగతి రథ చక్రం అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

స్పందించిన ఎంపీ రంజిత్‌రెడ్డి
గౌర్రెల కాపరికి రూ.50 ఆర్థిక సాయం


సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: జీవనం చెల్లాచెదురు అనే శీర్షికతో ఈనెల 2న సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు ఎంపీ రంజిత్‌రెడ్డి మంగళవారం స్పందించారు. స్టేషన్‌ధారూరు సమీప రైలు పట్టాలపై 50 గొర్రెలు మృతి చెందడం, కొన్ని తీవ్ర గాయాలకు గురైన సంఘటనపై ఎంపీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దోర్నాల్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కుర్వ కిష్టయ్యకు రూ.50 వేలు ఆర్థిక సహాయంగా ఇస్తున్నట్లు ఎంపీ ప్రకటించారు. ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందే వీలుంటే కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

హత్య కేసులో ఇద్దరికి రిమాండ్

దోమ: హత్య కేసులో ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్ తరలించినట్లు పరిగి సీఐ వెంకటరామయ్య తెలిపారు. ఈ నెల ఒకటిన మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో గునిగారి చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన నండి భీమయ్య, నండి మహేశ్ అనే వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం విదితమే. అయితే నిందితులు పరారీలో ఉన్నప్పటికీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితులిద్దరూ పరిగి పట్టణ పరిధిలోని తుంకులగడ్డ గేట్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. సమగ్ర దర్యాప్తుతో సాక్ష్యాధారాలను సేకరించి నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పై క్విజ్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు తెలిపారు. జిల్లాలోని 150 పాఠశాలల నుంచి 300 నామినేషన్లు అందినట్లు తెలిపారు. వీరందరికి గత నెల 27 నుంచి మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 13 పాఠశాలలకు చెందిన 26 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి ఇద్దరిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. పూడూరు మోడల్ స్కూల్‌కు చెందిన ఎన్. ప్రవీణ్ కుమార్, సాదియా ఇస్మాయిల్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 10న రాష్ట్ర స్థాయిలో జరిగే క్విజ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి



ఎస్.నారాయణరెడ్డి



భానుప్రసాద్



కె.నవీన్

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయపోల్ సమీపంలో చోటుచేసుకుంది. సీఐ రామకృష్ణ కథనం ప్రకారం.. కందుకూరుకు చెందిన నారాయణరెడ్డి, లంగర్ హౌస్ డిఫెన్స్‌కాలనీకి చెందిన భానుప్రసాద్, హస్తినాపురం ఈస్ట్ కాలనీకి చెందిన నవీన్ ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ రెండో సంవత్సరం చదువుతున్నారు. వీరు బైక్‌పై రాయపోల్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్నారు. అదే సమయంలో ఎదురుగా దూసుకొచ్చిన మారుతి వాహనం (ఏపీ28 బీఎస్ 0010) వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలొదిరారు. కాగా, భారత్ ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాద్ వెళ్లే దారిలో ఉంటే.. వీరు రాయపోల్ వైపుగా ఎందుకు వచ్చారో తెలియాల్సి వుంది. కారును నడిపిస్తున్న పి.శివను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

నేనూ భగీరథ నీళ్లు తాగుతున్నా..

- మోకాళ్లనొప్పులు దూరమయ్యాయి
- డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

తాండూరు రూరల్: నేనూ భగీరథ నీళ్లు తాగుతున్నానని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ చాలా గ్రామాల్లో ప్రజలు భగీరథ నీళ్లు తాగడంలేదన్నారు. నీళ్లు శుద్ధమైనవని ప్రతి ఒక్కరూ తాగాలని సూచించారు. ఈ నీటిలో ఎలాంటి కెమికల్ ఉండవని ... స్వచ్ఛంగా ఫిల్టర్ అవుతాయన్నారు. ఈ నీళ్లు తాగడం వల్ల మోకాళ్ల నొప్పులు దూరమయ్యాయని చెప్పారు. బిజ్వార్, ఖాంజాపూర్, గోనూర్, వీర్‌శెట్టిపల్లి గ్రామాల్లో ప్రజలకు మిషన్ భగీరథ నీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ రతన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి ఇంటికి వచ్చిన తల్లికి..

- ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన ఒక్కగానొక్క కొడుకు
- ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య
- పరిగిలో విషాదకర ఘటన



వినయ్ (ఫైల్)

పరిగి: బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన తల్లికి ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఫ్యాను వేళాడుతూ కనిపించాడు. ఈ విషాదకర ఘటన పట్టణ కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని నస్కల్‌గ్రామానికి చెందిన రాయల కృష్ణయ్య, కృష్ణవేణిలు పట్టణ కేంద్రంలోని సిద్ధాంతి కాలనీలో జీవిస్తున్నారు. వీరికి వినయ్(28) అనే కుమారుడు ఉన్నాడు. కృష్ణయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. తండ్రి మృతి చెందడంతో వినయ్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఇటీవల మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్లకు సెలెక్షన్స్

ధారూరు: స్పోర్ట్స్ స్కూల్‌లో 4, 5 తరగతుల్లో ప్రవేశం కోసం బుధవారం సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాబుసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలో ఎంపిక పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఉ. 9:30కు హాజరు కావాలని సూచించారు.

బషీరాబాద్ బాయ్స్ హైస్కూల్లో..

బషీరాబాద్: బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్పోర్ట్స్ స్కూల్స్‌లో అడ్మిషన్లకు ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రేపు యాలాలలో..

యాలాల: స్థానిక హైస్కూల్‌లో గురువారం స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్లకు సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పూడూరులో సెలెక్షన్స్ రేపు

పూడూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి హరిశ్చందర్ తెలిపారు.

బ్లాక్ గ్రౌండ్‌లో..

అనంతగిరి: వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించే స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్ల ఎంపికకు సకాలంలో హాజరు కావాలని ఎంఈఓ బాబుసింగ్ తెలిపారు.

పులమద్దిలో డీఆర్డీఓ పర్యటన



పులమద్దిలో పర్యటిస్తున్న డీఆర్‌డీఓ

అనంతగిరి: వికారాబాద్ మండలం పులమద్ది గ్రామంలో మంగళవారం డీఆర్డీఓ కృష్ణన్ పర్యటించారు. ఇంకుడు గుంతలపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న ఇంకుడు గుంతలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీటీవో సత్తయ్య, ఏపీ శ్రీనివాస్, సర్పంచ్ మాధవరెడ్డి, ఈసీ నవీన్, టీఏ భీమయ్య, ఎఫ్ఏ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.

'ఉపాధి'పై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా అధికారి

పెద్దేముల్: గ్రామీణ ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 2018 నుంచి 2020 వరకు జరిగిన పనులపై మంగళవారం జిల్లా అధికారి గుర్రం రాములు .తనిఖీ చేశారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై ఆరా తీశారు. పనుల్లో అవకతవకలు జరిగినట్లు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారి లక్ష్మీదేవి, ఈసీ కృష్ణ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640258899, 9640468899 [H-189303]

■ VISA Consultation overseas Blue & White Colour Jobs. All Profiles Lucrative. Salary High Pay. Interview 3rd to 5th July Hyd & 8 to 11 July Vizag. Ph: 9717618737 [HA-3070]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.